ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (రావులపాలెంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 26-3-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అందరికీ సుఖం కావాలి, శాంతి కావాలి. మన స్వరూపమే సుఖం, మన స్వరూపమే శాంతి. దేహాన్ని ఆత్మ అనుకోవటంవలన మనకు అన్ని క్లిష్ట పరిస్థితులు, చిక్కులు, అశాంతి వస్తున్నాయి. జాగ్రదావస్థలో విషయభోగములను అనుభవిస్తున్నాము. గాఢనిద్రలో స్వరూపసుఖాన్ని అనుభవిస్తున్నాము. స్వరూప సుఖం బాహ్యపరిస్థితులమీదగాని, కుటుంబ పరిస్థితులమీదగాని, సాంఘిక పరిస్థితులమీదగాని ఆధారపడిలేదు. అది స్వతంత్రమైనది. కాని మనందరకు కూడా నేను అంటే చాలా ఇష్టం. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను కోసమే ఇతరులను ప్రేమిస్తున్నాము, ఇతరులమీద ద్వేషం తెచ్చుకొంటున్నాము. ఈ నేను నేను కాదన్న సంగతి, ఇది నిజం కాదన్న సంగతి మనకు ఇంకా అర్థం కాలేదు. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది గాఢ నిద్రలో లేదు. ఆ నేను లేనప్పుడే ఆనందముగా, సుఖంగా ఉన్నాము. ఆ నేను వచ్చిన తరువాతే మన సుఖాన్ని, ఆనందాన్ని, శాంతిని అది పోగొడుతోంది. ఏ నేను అయితే మన స్వరూపసుఖాన్ని పోగొడుతోందో ఆ నేను అంటేనే మనకు ఇష్టం. మన సుఖానికి అడ్డు వచ్చేది ఎవరో ఇతరులు కాదు, ఈ నేనే అడ్డు వస్తోంది.

నీకు జ్ఞానం అర్థమయితే, తత్వం తెలిస్తే, భగవంతుని మాటలయందు గౌరవము కుదిరితే దేహం ఏ రకమైన ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ మీ శాంతి చెదరదు. ఒకో దేహముయొక్క ప్రారబ్ధం ఒకో రకంగా ఉంటుంది. దేహం ప్రారబ్ధమును అనుభవిస్తున్నప్పటికీ మనకి కనుక భక్తి ఉంటే మన మనస్సు భగవంతునిమీద ఉంటుంది. దేహమును ప్రారబ్ధమునకు వదలివేయండి. ప్రారబ్ధమును పూర్తిచేసుకొని అది చనిపోతుంది. భగవంతుని చింతిస్తూ ఉంటే నీకు రెండు లాభములు. ప్రారబ్ధమును తేలికగా అనుభవించవచ్చును. మనస్సు పరమేశ్వరుని చింతించటంవలన మనస్సు పరమేశ్వరునియందు ఐక్యం అవుతుంది. మనకు సత్వగుణం వచ్చినప్పుడు సుఖంగాను, శాంతిగాను ఉంటుంది. తాత్కాలికంగా మీకు శాంతి కలిగినా అది నిజం అనుకోవద్దు. వెంటనే వాసన వచ్చి మీ శాంతిని చెడగొడుతుంది. లోపల వాసన ఉన్నంతసేపు మనకు శాంతి కలిగినా అది తాత్కాలికమే గాని శాశ్వతం కాదు. పూర్తిగా వాసనాక్షయం అయినపుడు మాత్రమే శాంతి శాశ్వతంగా ఉంటుంది. భగవంతునిమీద భారం వేసి జీవించటం నేర్చుకుంటే ఈ జీవితయాత్ర సుఖంగా సాగుతుంది. 100 సంవత్సరాలు జీవించినా 100 క్షణాలక్రింద వెళ్ళిపోతుంది. మనం ఎవరము ఆత్మే. ఆత్మ, సుఖం వేరు కాదు. కాబట్టి ఆత్మను తెలుసుకోమని వేదం చెపుతోంది. ఆత్మను తెలుసుకొంటే సుఖపడతావు. నీవు సుఖివి అవుతావు. అందువలన ఆత్మను తెలుసుకో.

నీ జీవితంలో పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా బ్రహ్మానుభవం కలిగితే నీ శాంతి చెదరదు, చెరగదు. ఎందుకంటే అది స్వతంత్రమైనది. చైతన్యముతానే అన్నసంగతి వాడికి స్పష్టంగా తెలుస్తూఉంటుంది. స్థూల, సూక్ష్మ శరీరములు రెండూ మిధ్యే అని తెలుస్తూఉంటుంది. తత్వం తెలియనివాడు శరీరము, మనస్సు చుట్టూ తిరుగుతూ ఉంటాడు. తత్వం తెలిసినవాడికి ఈ రెండింటి గొడవ ఉండదు. ఇవి రెండూ నిజం కాదు అని స్పష్టంగా తెలుస్తూఉంటుంది. అందువలన వాటి చెంతకు చేరడు. సామాన్య మానవునికి దేహబుద్ధి ఎంత సహజముగా ఉంటుందో తత్వం తెలిసినవాడికి ఆత్మబుద్ధి అంత సహజంగా ఉంటుంది. తత్వం తెలిసినవాడికి శాంతి సహజముగా ఉంటుంది. సత్వగుణం కనుక అభ్యాసము చేస్తే ఆ

శాంతి నీకు కూడా దొరికే అవకాశం ఉంది.

నీ హృదయములో ఉన్న నిజాన్ని నీ అంతట నువ్వే ప్రయత్నం చేసి తెలుసుకోవాలి. కాని నీకోసం ఇతరులు చేసిపెటరు. ఇతరులు అన్నం తింటే మీకు కడుపు నిండదు. మీరు తింటేనే మీకు కడుపు నిండుతుంది. నీలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి గురువు సహకరిస్తాడు. చివరకు తెలుసుకోవలసినది నువ్వు మాత్రమే. నీకోసం ఎవరూ తెలుసుకొనిపెటరు. నువ్వే తెలుసుకోవాలి. బ్రహ్మానుభవమును పొందాలనే కాంక్ష నీవు ఆపుకుందామన్నా ఆపుకోలేనంత వేగముగా నీ హృదయంయొక్క లోతులలోనుండి రావాలి. అప్పుడు మాత్రమే అది నీకు ఎరుకపడుతుంది. మరణమును జ్ఞాపకం పెటుకోండి. మీ కుటుంబ పరిసితులు, సామాజిక పరిసితులు ఎంత బాగున్నా ఏదో రోజున శరీరము మరణిస్తుంది. ఈ శరీరము ఏదో రోజు మరణిస్తుంది అని రోజూ ఒకసారి గుర్తు చేసుకొంటూ ఉంటే దానికి మనం ప్రిపేర్ అవుతాము.

నీకు తెలిసినా, తెలియకపోయినా నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావు లేదు. పుట్టుక లేదు. దాని స్వరూపము సుఖము, శాంతి. అది ఎవరో కాదు అది నీవై ఉన్నావు. అది నీవే అయినప్పటికీ అది నీవే అన్న సంగతి నీకు తెలియటంలేదు. అది నీవే అని తెలుసుకోవటానికి ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో అవి తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన. మన హృదయంలో ఉన్న నిజం మనకు అనుభవంలోనికి రాకుండా ఏమి అడ్డు వస్తున్నాయో ఏ మనిషికి ఆ మనిషి చూసుకోవాలి. ఒకో శరీరానికి ఒకో రోగం ఎలా ఉంటుందో, ఒకో మనస్సుకు ఒకో బలహీనత ఉంటుంది. నీ మనస్సులో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేయాలి.

జ్ఞాని అంటే బ్రహ్మమే అందుచేత దేనిని చూసినా బ్రహ్మంగానే చూస్తాడు. ఇక్కడ అనేక రూపాలు ఉన్నాయి. ఒకో రూపానికి ఒకో పేరు. రూపానికి పేరు లేకపోతే వ్యవహారం నడవదు. బ్రహ్మానుభవం పొందినవాడు రూపాలు, నామాలు చూస్తూ ఉంటాడు. ఈ రూపాలు, నామాలు అన్నీ బ్రహ్మంనందు కల్పించబడ్డాయి అన్న సంగతి వాడికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. అందువలన మోహానికి గురికాడు. గౌరవాలు, అగౌరవాలు, చావులు, పుట్టుకలు, ఇవి అన్నీ దేహగతమైన నేనుకే. మన హృదయంలో ఉన్న నిజానికి వీటితో ఎటి సంబంధము లేదు. భయము, కోపము, ద్వేషము, ఇషము ఇవి అన్నీ తలంపులే. ఇవి అన్నీ నేను అనే మొదటి తలంపుకు వస్తున్నాయి. ఈ నేను అనే మొదటి తలంపును దేవుడికి ఇచ్చివేస్తే ఇంక నీకు వ్యక్తి భావన ఉండదు. మీ భర్తను మీరు ప్రేమిస్తున్నారు అంటే మీ భర్తకోసం ప్రేమించటం లేదు. ఈ నేనుకోసమే మీ భర్తను ప్రేమిస్తున్నారు. ఈ నేనుకు గనుక మీ భర్త వ్యతిరేఖం అయితే మీ భర్తకు కూడా దూరం అవుతారు. సంఘానికి జడిసి సంసారం చేసినా మానసికంగా దూరం అవుతారు. మానవుడు ఏ పని చేసినా ఈ నేను కోసమే చేస్తాడు. నేను చెప్పేవి అన్నీ నిజం అనుకోనక్కరలేదు. మీరుకూడా ఆలోచించుకోండి అని భగవాన్ చెపుతున్నారు. వింటే సరిపోదు మీరు కూడా ఆలోచించుకోండి. ఆలోచించుకొంటే అర్థమవుతుంది, అప్పుడు అది మీ స్వంతం అవుతుంది.

ఈ దేహం ఎంత బాగున్నా, ఎంత అందంగా ఉన్నా ఏదో రోజు స్మశానంలో పిడకలకి అప్పగించవలసిందే. మనం ఎన్ని భోగాలు అనుభవిస్తున్నప్పటికీ ఈ భోగాలు అన్నీ దేహగతమైన నేనుకు మాత్రమే. జీవుడికి ప్రపంచంలో ఉన్న భోగాలు అన్నీ కావాలి. కాని నీ హృదయంలో ఉన్న నిజానికి ఈ భోగాలు అక్కరలేదు. మనకు అయిదు ఇంద్రియాలు ఉన్నాయి. ఇంకో అయిదు ఇంద్రియాలు ఇస్తే బాగుండును ఇంకా భోగాలు అనుభవించవచ్చును అనిపిస్తుంది. మనస్సుయొక్క ఆశ అటువంటిది. దేహం ఏదో రోజు స్మశానంలో పిడకలకి ఆహుతి అవుతుంది. అయ్యో ఈ దేహం చాలా అందంగా ఉంది అని స్మశానంలో అగ్ని ఊరుకొంటుందా? లేదు దీనిని కాల్చి విడిచి పెడుతుంది. ఇతరులతో అవసరము లేకుండా మా జీవితము బాగా వెళ్ళిపోతోంది. ఇతరులు మా దగ్గర తలవంచాలిగాని మేము ఇతరుల దగ్గర తలవంచనక్కర లేదు. ఎదుటివారిదగర చేయిచాపనక్కరలేకుండా మా జీవితం గొప్పగా వెళ్ళిపోతోంది. మాకు ఏమీ లోటు లేదు అని కొంతమంది అనుకొంటూ ఉంటారు. ఈ భోగాలు అనుభవిస్తున్న జీవుడు కూడా ఏదో రోజు

నశించిపోతాడు అని మనకు తెలియటంలేదు. శరీరం ఎలాగూ నశించిపోతుంది. కళ్ళతో చూస్తున్నాము. నువ్వు ఎవడవు? ఇన్ని భోగాలు అనుభవిస్తున్నావు అని ప్రశ్న వేసుకొంటే ఇన్ని జన్మలనుండి ఈ భోగాలు అనుభవిస్తున్న జీవుడు కూడా ఏదో రోజున జ్ఞానాగ్నివలన కాలి బూడిద అయిపోతాడు. భౌతికమైన అగ్నివలన ఈ శరీరం కాలి బూడిద అవుతుంది. జ్ఞానాగ్నివలన నీలో ఉన్న మనస్సు కాలిపోతుంది. నీవు ఏ రెండూ చూట్టూ తిరుగుచున్నావో, వేటిని ఆధారంగా పెట్టుకొని బ్రతుకుచున్నావో ఆ రెండూ ఈ నాటికైనా, ముందునాటికైనా కాలి బూడిద అవ్వవలసిందే. శరీరం పిడకలవలన కాలిపోతుంది. నీలోపలనుండి వచ్చిన జ్ఞానాగ్ని వలన జీవుడు కాలిపోతాడు. రెండూ కూడా ఏదో రోజు కాలిపోయేవే అన్న సంగతి నీకు తెలియాలి. ఈ జీవుడు కూడా ఏదో రోజు కాలిపోతాడు అని నీకు తెలిస్తే భోగంయందు ఆసక్తి తగ్గుతుంది.

ఏ నేనును నీవు నిజం అనుకొంటున్నావో, ఏ నేనుకోసమైతే నీవు జీవిస్తున్నావో ఆ నేను కనుక నిజమయితే నీకు సాధన అక్కరలేదు. విచారణ అక్కరలేదు. నిజం కాని దానిని నిజం అనుకొంటున్నావు అందువలన విచారణ చెయ్యాలి. మనకు శాంతి, సుఖం కావాలి. అవి దేవునిలో ఉన్నాయి కాబట్టి దేవుని కోరుకొంటున్నాము. తాత్కాలికంగా మీ కుటుంబ పరిస్థితులు బాగా ఉన్నప్పటికీ, మీరు సుఖంగా ఉన్నప్పటికీ దుఃఖము మీకు రాదు అనుకోకండి. దుఃఖము వాయిదా పడుతోంది గాని ఏదో రోజు తప్పక వచ్చి తీరుతుంది. మీ హృదయంలో ఉన్న నిజం మీకు తెలియబడే వరకూ దుఃఖము మిమ్మలను విడిచిపెట్టదు. ఈ దేహంలో ఉండగా పుణ్యం చేసుకొన్నారు అనుకోండి ఆ పుణ్య ఫలితం ఈ దేహంలో రావాలని ఎక్కడా లేదు. ఈ దేహంలో పుణ్యం చేస్తారు. మరో దేహంలో పుణ్య ఫలితం అనుభవిస్తారు. దేహం మారుతుంది గాని అనుభవించే జీవుడు ఒక్కడే. ఆ పుణ్య ఫలితం ఖర్చు అయిపోగానే వాడి సుఖం కూడా కరిగిపోతుంది.

పవిత్రతవలన మోక్షం వస్తుందిగాని యుక్తివలన ఎవరికీ మోక్షం రాదు. మీ తెలివి వలన వ్యవహారాన్ని సరిదిదుకోవచ్చును గాని మోక్షం రాదు. సహజమైన శాంతికి, సుఖానికి మీకు ఏ నేను అయితే అడ్డు వస్తోందో ఆ నేనును సాధన చేసి పోగొట్టుకొన్నా సరే, మీకు పోగొట్టుకొనే శక్తి లేకపోతే నాకు ఇచ్చినాసరే అన్నాడు కృష్ణుడు. భగవంతునికి ఇచ్చివేస్తే అది భక్తిమార్గము. మీఅంతట మీరు పోగొట్టుకొంటే అది జ్ఞానమార్గము. మొత్తంమీద ఎలాగైనా దానిని పోగొట్టుకోవాలి. సాధన చేయగా చేయగా సాధనయొక్క ప్రయోజనం ఏమిటి అంటే ఏకాగ్రత, పవిత్రత కలుగుతుంది. ఏకాగ్రత, పవిత్రత లేనివాడు మోక్ష సుఖాన్ని పొందలేడు. భగవంతుని నామమును వినటంవలన, స్మరించటంవలన మనకు ఏకాగ్రత, పవిత్రత వస్తాయి. ఇవి రెండూకూడా తత్వం తెలుసుకోవటానికి మనకు సహకరిస్తాయి.

వ్యక్తిభావన పోగొట్టుకోమని మీరు చెపుతున్నారు. ఆ మాటలు వింటూ ఉంటే నాకు కంగారు వస్తోంది. ఏదైతే నేను, నేను అంటున్నానో ఆ నేనును అట్టే పెట్టుకొని మీరు మిగతా సాధనలు చెపితే నాకు కంగారు రాదు. నీవు పూజ చేసుకో, జపం చేసుకో, ప్రాణాయామం చేసుకో ఇటువంటి మాటలు చెపితే నాకు కంగారు రాదు. పూజలు చేసుకోమని చెప్పండి, వైకుంఠానికి వెళ్ళమని చెప్పండి. కాని మీరు వైకుంఠానికి వెళ్ళేవాడిని ఆపేస్తున్నారు. నా ప్రయాణం ఆపేస్తున్నారు. అందుకు కంగారు వస్తోంది. ఏ నేనుకోసం జీవిస్తున్నానో, ఏ నేనును అలంకరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నానో దానిని పోగొట్టుకోమని చెప్పటం న్యాయంగా లేదు. నాకు కంగారు వస్తోంది, భయం వేస్తోంది. ఏ నేను అనుభవిస్తోందని పుణ్యం చేస్తున్నానో దానినే పోగొట్టుకోమని మీరు చెపితే కంగారు పడక ఏమి చేస్తాను అంటున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీవు అడుగుతున్నావు కాబట్టి చెపుతున్నాను. నిన్ను బలవంతం చేయవలసిన పని నాకు లేదు. నేనును విడిచిపెట్టటం ఇష్టం లేదు అంటున్నావు. నేనును అట్టే పెట్టుకోవాలంటే అట్టే పెట్టుకో కాని నీకు మోక్షం ఎన్నటికీ రాదు. నీకు మోక్షం కావాలా ఈ నేనును వదులుకో. నీకు మోక్షం అక్కరలేదా ఈ నేనును అట్టే పెట్టుకో. రెంటిలో ఏదో ఒకటి చేసుకో. ఆ పని, ఈ పని నీ చేతిలో ఉంది. అది నీవే నిర్ణయించుకో. ఈ నేనును విడిచిపెట్టి నిర్వాణ స్థితిని పొందుతావా పొందు లేకపోతే నేనుతోటి పుణ్యం చేసి సుఖాన్ని అనుభవించటం, పాపం చేసి దుఃఖాన్ని అనుభవించటం ఇలా జననమరణ ప్రవాహంలో

కొట్టుకొనిపోతావా కొట్టుకొనిపో. ఏదో నీవే నిర్ణయించుకో. ఈ నేనును అట్టేపెట్టుకొని మోక్షం పొందటానికి చూస్తున్నావు. నీవు కోట్లాది జన్మలు ఎత్తినా, యుగాలు గడిచిపోయినా అది సాధ్యం కాదు అని చెపుతున్నారు. నీవు ఏ మార్గం కావాలో నిర్ణయించుకొని ప్రయాణం చెయ్యి.

నేనును మినహాయించమని నేను అడుగుతున్నాను. ఆ నేనును మింగేస్తానని మీరు అంటున్నారు. మీకు నాకు రాజీ కుదరటం లేదు. నేనును మినహాయించి ఏమి చెప్పిన నేను వింటాను అని అడుగుతున్నాడు. నేనును తొలగించమని భగవాన్ చెపుతున్నారు. ఇక్కడ ఇద్దరూ రాజీపడలేకపోతున్నారు. నాకు అర్థమయ్యేటట్లు చెప్పటానికి మీరు ప్రయత్నం చేస్తున్నారు. మీ మాటలలో దోషం ఉంది అని నేను అనటంలేదు. మీరు చెప్పేది నిజం అయి ఉండవచ్చు. నాకు కంగారుమటుకు పోవటంలేదు. నా భయం నాకు ఉంది. ఆ నిజానికి కళ్ళు తెరవలేకపోతున్నాను. నేను ప్రిపేరు అవ్వలేదనుకొంటున్నాను. నిజానికి నా కళ్ళు తెరిచేలాగ మీ అనుగ్రహాన్ని పంపించి మీరు సహాయం చేస్తేకాని మీ మాటలు నాకు అర్థమవ్వవేమో? నాకున్న బాధని, భయాన్ని మీకు చెపుతున్నాను. ఇవి తొలగించటానికి మీ మాటలు కాకుండా మీ అనుగ్రహాన్ని పంపించమని కోరుకొంటున్నాను అన్నాడు. ఏజ్ఞానికూడా ప్రేమ లేకుండా, అనుగ్రహం లేకుండా ఉండడు. ప్రతీ జ్ఞాని కూడా ప్రేమ స్వరూపుడు, కాంతి స్వరూపుడు, అనుగ్రహ స్వరూపుడు. భగవాన్ చెపుతున్నారు నీవు నా మాటలు వింటున్నావు. నా మాటలు వినేటప్పుడు నీకు దేహబుద్ధి వచ్చేస్తోంది. అందువలన అలజడి వస్తోంది. నా మాటలు అర్థంకాకుండా నీ దేహబుద్ధి అడ్డు వస్తోంది. ఏమి చేస్తాము దేహబుద్ధి అంత బలీయంగా ఉంది. చిత్తశుద్ధిగా తెలుసుకోవాలి అని ప్రయత్నం చేస్తున్నావు. నీలో పొరపాటు లేదు. నేను చెప్పే మాట నీ హృదయంలోనికి దిగకుండా, నీ అనుభవానికి రాకుండా నీ దేహబుద్ధి వచ్చి మధ్యన అడ్డుపడుతోంది. ఈ శవబుద్ధి ఉన్నంత కాలము శివబుద్ధి నీకు కలుగదు.

దేహాన్ని నేను అని నీవు అనుకోవచ్చు. నీవు చనిపోయేవరకూ నేను దేహాన్ని, నేను దేహాన్ని అని నీవు అనుకోవచ్చు. అయినా నీవు దేహం కాదు. దేహబుద్ధి ఎప్పుడైతే వచ్చిందో నా మాటలు నీకు పట్టటం లేదు అని భగవాన్ చెపుతున్నారు. ఈ దేహం భౌతికమైన అగ్నికి ఆహుతి అవుతుంది. నీవు నిజం అనుకొనే మనస్సు కూడా ఏనాటికైనా జ్ఞానాగ్నికి ఆహుతి అవ్వవలసిందే. నీవు దేహము అనుకొన్నప్పుడు చైతన్యమే. నీవు మనస్సువు అనుకొన్నప్పుడు చైతన్యమే. నీవు అనుకొంటే అనుకోవచ్చును. ఒక నిజం కానిదానిని నీవు నిజం అనుకొన్నా అది నిజం అవ్వదు. నీవు నమ్మావని అది నిజం అవ్వదు. అలాగే నీవు దేహం అని అనుకొన్నా నీవు దేహం కాదు. నీవు బ్రహ్మమే. చావుపుట్టుకలు లేని సద్వస్తువే నువ్వు. కాని నీవు మనస్సుతో కలిసిపోతున్నావు. జీవలక్షణాలు వచ్చి నీ నెత్తిమీద పడుతున్నాయి. నీవు కానిదానితో కలవటం వలన ఈ అలజడి అంతా వస్తోంది. నిజంకానివి అన్నీ కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి. మనస్సుతో కలిస్తే బంధం, మనస్సునుండి విడిపోతే మోక్షం.

మీరు చెప్పిన మాటలలోని నిజాన్ని, అంతరార్థాన్ని జ్ఞాపకం పెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తాను. చీకటిలోనుండి వెలుతురులోనికి రావటానికి సహాయపడేలాగ, ఈ మాటలు ఇంకా నా గుండెయొక్క లోతులలోనికి దిగేలాగ ఇంకా కొంచెం వివరంగా చెపితే నేను సంతోషిస్తాను అని అడుగుతున్నాడు. నా మెదడుకు ఇంకా వివరణ అవసరము. నా మెదడు పట్టుకొంటే కాని నేను ఆచరించలేను. అందువలన మీరు ఇంకా వివరంగా మరొకసారి చెప్పండి అని అడుగుతున్నాడు. నువ్వు రోజూ నిద్రపోతున్నావా అని భగవాన్ అడిగారు. రోజూ నిద్రపోతున్నాను అని చెప్పాడు. నిద్రలోనికి వెళ్ళేముందు ఏడుస్తూ నిద్రపోతున్నావా లేక సంతోషంగా నిద్రపోతున్నావా అని భగవాన్ అడిగారు. సంతోషంగానే నిద్రపోతున్నాను. నిద్రపట్టటం ఆలస్యం అయితే ఇంకా నిద్ర రావటంలేదు ఏమిటి అనుకొంటున్నాను అని చెప్పాడు. నిద్రలోనికి వెళ్ళే క్షణంలో ఏమైనా భయం కలుగుతోందా అని భగవాన్ అడిగారు. నిద్ర అంటే నాకు భయం లేదు. నాకు ఇష్టంగానే ఉంది అని చెప్పాడు. నేనును పోగొట్టుకోవటానికి భయం వేస్తోంది అని చెపుతున్నావు. నిద్రలో నేను ఉండదుకదా. మరి అప్పుడు భయం వేయాలికదా. మరి సంతోషంగా నిద్రలోనికి ఎందుకు వెళుతున్నావు.

నిద్రలో ఈ నేను ఉండదు అని తెలిసికూడా నిద్రను ఎందుకు కోరుకొంటున్నావు. నిద్రలో ఈ నేను లేనపుడు నీవు సంతోషంగా ఉన్నావా? దుఃఖంగా ఉన్నావా? సంతోషంగానే ఉన్నావు. నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆనేను, దానికి సంబంధించిన పరివారము లేకుండా గాఢనిద్రలో నీవు సంతోషంగానే ఉన్నావు. కాదనటానికి వీలు లేదు. ఈ ప్రశ్నించేవాడే కాదు ఎవ్వడూ కూడా కాదనటానికి వీలు లేదు.

గాఢనిద్రలో నేను లేని స్థితి ఒకటి ఉంది. అక్కడ నీవు సుఖంగా ఉన్నావని నీకు తెలుస్తోంది. ఆ స్థితి జాగ్రదావస్థలో కూడా ఉంది. అది నిన్ను విడిచిపెట్టి ఎక్కడికి పోలేదు. నీవు నమ్మినా, నమ్మకపోయినా ఆ స్థితి ఉంది. నీవు దేవుడిని నమ్మకపోయినా గాఢనిద్రలో ఏ స్థితి అయితే ఉందో జాగ్రదావస్థలో కూడా ఆ స్థితి ఉంది అని పూర్తిగా నమ్ము. దేవుడి గొడవ వదిలెయ్యి. గాఢనిద్రలో ఉన్న స్థితి జాగ్రదావస్థలో కూడా ఉంది అనే విశ్వాసం నీకు కలిగితే, ఆ స్థితిని పొందటానికి జాగ్రదావస్థలో నీవు ఏమాత్రం ప్రయత్నం చేసినప్పటికీ గాఢనిద్రలో నేను ఎలా లేకుండా పోయిందో అలాగ జాగ్రదావస్థలో నిన్ను ఇబ్బందులు పెడుతున్న నేను, నీ జనన మరణ ప్రవాహమునకు కారణమైన నీలో నేను రూపములో ఉన్న నరకాసురుడు కాలి బూడిద అవుతాడు. గాఢ నిద్రలో ఉన్న స్థితి మెలుకువలో కూడా ఉంది. ఆ స్థితి నీకు అందకుండా నేను అడ్డు వస్తోంది. గాఢ నిద్రలో ఉన్న స్థితి మెలుకువలో కూడా ఉంది అన్న విశ్వాసం నీకు ఎప్పుడైతే కుదిరిందో ఈ నేను దానికి శరణాగతి చెందుతుంది. అంటే ఈ నేను Higher Powerకు తన్ను తాను అర్పించుకొంటుంది.

తలంపులు లేనపుడుకూడా మనం ఉంటాము అన్న సంగతి అర్థంకాక తలంపులు లేకపోతే నేను ఉండను అని అనుకొంటున్నాడు. గాఢ నిద్రలో ఉన్న feelingsను మెలుకువలో తెచ్చుకోవాలి అని అంటున్నాడు. తలంపులు, feelings లేని స్థితిని ఇతడు ఊహించలేకపోతున్నాడు. వేలాది జన్మలనుండి మనస్సును వేసుకొని తిరుగుతున్నాడు. మనస్సును విడిచిపెట్టలేకపోతున్నాడు. గాఢనిద్రలో ఉన్న feelingsను ఇప్పుడు తెచ్చుకోవాలి అంటున్నాడు. గాఢనిద్రలో ఏమీ feeling లేదు. Feeling వస్తే false I వచ్చేసినట్లే. అంటే అబద్ధమైన నేను వచ్చేసినట్లే. Feeling కాదు. గాఢనిద్రలో ఒక స్థితి ఉంది. అది జాగ్రదావస్థలోకూడా ఉంది. ఆ స్థితికి శరణాగతి పొందు అని భగవాన్ చెపుతూ ఉంటే వీడు feeling అంటున్నాడు. ఇలా ఇద్దరూ మాటాడుకొంటూ ఉంటే మూడవ వ్యక్తి వచ్చి భగవాన్ ఏ హృదయంతో మాటలు చెపుతున్నారో ఈ ప్రశ్నించేవాడు ఆ హృదయాన్ని పట్టుకోలేకపోతున్నాడు. ఆ మాటలలో ఉన్న స్పిరిట్‌ను అర్థంచేసుకోలేకపోతున్నాడు. ఆ మాట ఎంత బరువుగా ఉందో అంత బరువుగా subjectను రిసీవ్ చేసుకోలేకపోతున్నాడు అని అన్నాడు. అప్పుడు భగవాన్ నీవు చెప్పేది నిజం అవ్వవచ్చు. అతనికి అర్థంకావటం లేదేమో? వాడికి అవగాహన అయినా, అవ్వకపోయినా గాఢనిద్రలో దేహానికి సంబంధించిన తలంపులేదు. గాఢనిద్రలో ఉన్న స్థితి వాడికి అర్థమయినా, కాకపోయినా అక్కడ దేహగతమైన నేను లేదు, అక్కడ feelings లేవు. దేహగతమైన నేను వచ్చినపుడే feelings వస్తాయి. అక్కడ దేహగతమైన నేను లేదు కాబట్టి feelings లేవు, thoughts ఏమీ లేవు. అక్కడ దేహం గొడవగాని, మనస్సు గొడవగాని, ప్రపంచం గొడవగాని, దేవుని గొడవగాని ఏమి లేదు. ఇవి అన్నీ లేకపోయినా గాఢనిద్రలో నేను లేను అని చెప్పే తాహతగాని, శక్తిగాని ఈ సృష్టిలో ఎవరికీ లేదు. నీవు బొత్తిగా పచ్చిగా ఉంటే నా దగరకు రావు. తెలుసుకోవాలనే కాంక్ష నీకు లేకపోతే నాదగరకు రావు. నీ మనస్సు కొంచెం ముగాలి. అవగాహన చేసుకొనే శక్తి రావాలి. లౌకిక విషయాలు మాటాడుకొనేటప్పుడే మనకి అవగాహన కానపుడు ఎక్కడో కనబడని, వినబడని వస్తువుగురించి అర్థంచేసుకోవటానికి ఎంత అవగాహన శక్తి ఉండాలి. అందువలన నీవు కొంచం ముగ్గాలి. అర్థం చేసుకొనే స్థాయి పెరగాలి అంటున్నారు భగవాన్.

ఏదైతే నేను అని నువ్వు అనుకొంటున్నావో ఆ నేనులో నుండి విడుదల పొందటంకోసం ఆ నేనును మర్చిపోయి పనిచేయాలి. ఆ నేనును మర్చిపోయి మాట్లాడాలి. నీకు చేతనయినంత, నీ శక్తి ననుసరించి ఆ నేనులోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేయాలి. ఆ నేనులోనుండి విడుదల పొందటానికి ఎంతవరకూ

ప్రయత్నం చేస్తున్నావో అంతవరకే ముగుతావు. చావుకోసం ఎదురుచూడకండి. దేహం ఉండగానే దేహబుద్దిలోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసి దేహబుద్ధిలోనుండి బయటపడకపోతే ఎన్ని వేల జన్మలు ఎత్తవలసి ఉంటుందో దానికి ఎవరూ చెప్పలేరు. మరణించిన తరువాత ఏదో వస్తుంది అని అనుకోవద్దు. మరల శరీరంకోసం ఒక తల్లి కడుపులో ప్రవేశించి బయటకు వచ్చి సాధన చేయవలసిందే గాని మరణించిన తరువాత సాధన ఉండదు. దేహం ఉండగానే కాలమును సద్వినియోగం చేసుకోండి. ఒకరోజు గడిచిపోతే రోజు బాగా గడిచిపోయింది అని సంతోషిస్తున్నాము గాని చావుకు దగ్గరవుతున్నామని మనకు తెలియటంలేదు.

మన హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావులేదు. పుట్టుక లేదు. దాని గురించి మనకు ఏమీ తెలియటం లేదు. మనకు దేహం గురించి తెలుస్తోంది. మనం ఏదైతే అవునో దాని గురించి మనకు తెలియటం లేదు. తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు. మనం ఏదైతే కాదో దానినికూడావేసుకొని తిరుగుచున్నాము. దానికోసమే జీవిస్తున్నాము. అయిన ఆత్మను కాదు అనుకొంటున్నాము. కాని దేహమును అవును అనుకొంటున్నాము. ఈ తిరకాసు బేరంలో పడ్డాము.

జాగ్రదావస్థలో ఉండగా మాకు గొప్ప జన్మలు రావాలి అనుకొంటారు. గొప్ప జన్మలు రావటం కోసం పుణ్యాలు చేస్తున్నారు. గాఢ నిద్రలో నాకు గొప్ప జన్మ రావాలి అని మీరు అనుకొంటున్నారా? అనుకోవటం లేదు. రాబోయే జన్మలు, పుణ్యాలు, పాపాలు ఇవి అన్నీ నిజంలో లేవు. మనస్సులో ఉన్నాయి. మనస్సు దాటితే పుణ్యాలు లేవు, పాపాలు లేవు, చావు లేదు, పుటుక లేదు. అహంకారము అనే గడప దాటారా మీరు చావు పుటుకలు లేని స్థితికి ఎదిగి వెళ్లిపోతారు. ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు ఇప్పుడే ఇక్కడే ఆ స్థితిని పొందుతారు.

నిజం చెప్పాలంటే చావు లేదు, పుట్టుక లేదు. చావు, పుట్టుక కూడా తలంపులే. శరీరం పుటినపుడు నీవు పుట్టలేదు అందువలన శరీరం చనిపోయినపుడు నీవు చనిపోవు. నేను అనే తలంపు పుటినపుడు నీవు పుట్టావు. దేహం ఏ రోజు పుట్టిందో మీకు తెలుస్తోంది. Birthday చేసుకొంటున్నారు. బూరెలు, గారెలు, పాయసం చేసుకొని తింటున్నారు. దేహం పుట్టింది. దేహం రావటం వలననే ఇంద్రియాలు వచ్చాయి. సంసారం వచ్చింది అనే బాధ ఎవడికీ లేదు. ఈ దేహముతో బాధపడలేక పోతున్నాము అనే గొడవ ఎవడికీ లేదు. మనకు birthday తెలుస్తోంది గాని death day తెలియటం లేదు. కాని deathday ఖాయమే. ఇది ఎంత అసత్యమో అది కూడా అంతే అసత్యము. నేను అనే తలంపు కొంచెము కూడా ఎక్కడైతే లేదో అక్కడే దేవుడు ఉన్నాడు అని భగవాన్ చెప్పారు. నిజమైన దేవుడు ఎక్కడ ఉన్నాడో భగవాన్ ఎడ్రసు చెపుతున్నారు. మీరు వెళ్ళగలిగితే ఆ ఎడ్రసు ఉన్నచోటుకు ప్రయాణం చేసి వెళ్ళండి. ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావు. ఇక్కడే నీ హృదయంలోనే ఉన్నాడు. నీ స్వరూపంగానే ఉన్నాడు నీ స్వరూప సుఖము, శాంతి నీ చేతికి అందితే నీ మనస్సు భోగాలవైపుకు తిరగమన్నా తిరగదు. మీ హృదయంలో ఉన్న నిజం మీకు తెలియబడే వరకూ జనన మరణ ప్రవాహములో కొట్టుకొనిపోవలసిందే. దేహము నేను అని మన బుద్ధికి ఎంత సహజముగా తెలుస్తోందో అంత సహజముగా హృదయంలో ఉన్న నిజం నేను అని మన బుద్ధికి తెలిసినపుడు మనం తిరిగి ప్రకృతిలోనికి రానక్కరలేదు. అంతవరకు జన్మలు తప్పవు. మనం ఎన్ని భోగాలు ఉన్న కుటుంబములో పుట్టినప్పటికీ ఈ శరీరం ఏదో రోజు మరణించవలసిందే. మనం జాగ్రదావస్థలో ఇంద్రియాలతో అనుభవించే భోగాలు పరిణామంలో రెట్టింపు దుఃఖమును తీసుకొనివస్తాయి. మన స్వరూప సుఖము అనుభవించేటప్పుడు అది మాత్రం మనకు భవిష్యత్‌లో దుఃఖమును తీసుకొనిరాదు. మనం నోటితో మాట్లాడే మాటలే, చేతితో చేసే పనులే ఏదో రోజు ఏదో జన్మలో ఎదురవుతాయి. మనం చేసినదే మనకు ఎదురవుతుందిగాని మనం చేయనిది మనకు ఎదురవ్వదు.

సహవాసం విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఎవరు మనకు బంధువులు? ఎవరు మనకు స్నేహితులు? మన హృదయంలో ఉన్న ఈశ్వరుని, అంతిమ సత్యాన్ని మనకు అనుభవంలోనికి తీసుకొని రావటానికి ఎవరైతే సహాయ సహకారములు అందిస్తున్నారో వారే మనకు బంధువులు, వారే మనకు స్నేహితులు